క్లుప్తంగా

ప్రశాంతంగా 'పది' పరీక్షలు



మోపిదేవి: పదో తరగతి పరీక్షలను మండలంలో ఏర్పాటు చేసిన మూడు పరీక్ష కేంద్రాల్లో శుక్రవారం ప్రశాంతంగా నిర్వహించారు. మోపిదేవి జెడ్పీ హైస్కూల్‌లో 160 మందికిగాను 157 మంది హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి దుర్గాసాగర్ తెలిపారు. పెదకళ్లేపల్లి జెడ్పీ హైస్కూల్ కేంద్రంలో 72 మంది, మహాత్మాజ్యోతిభా పూలే గురుకుల పాఠశాల కేంద్రంలో 112 మందికిగాను 111 మంది పరీక్షలకు హాజరైనట్లు ఎంఈఓ పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో శ్రీశివకామేశ్వరుల కల్యాణం



మచిలీపట్నంటౌన్: నగరంలోని బుట్టాయిపేటలో వేంచేసి ఉన్న శ్రీ వల్లభాంబా సమేత మహాగణపతి పంచాయతన క్షేత్రం(శ్రీ చిట్టి పిళ్లారయ్యస్వామి) దశమ వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గణపతి పూజ, మహావిష్ణుమూర్తి, శ్రీ సీతారామచంద్రస్వామికి అభిషేకాలు, అర్చనలు చేశారు. శ్రీ సుదర్శన నారసింహ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. హోమ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి వెంకట బాబాప్రసాద్ పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం శ్రీ శివకామేశ్వరుల కల్యాణం కనులపండువగా జరిగింది. కార్యక్రమాలను ఆలయ భక్తి బృందం ప్రతినిధులు పర్యవేక్షించారు.

కేడీసీసీ విశ్రాంత మేనేజర్ నాంచారయ్య మృతి



టి.కొత్తపాలెం(నాగాయలంక): కేడీసీసీ విశ్రాంత మేనేజర్, నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి మత్తి నాంచారయ్య(75) అస్వస్థతతో శుక్రవారం మృతిచెందారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ నాంచారయ్యకు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. కేడీసీసీ బ్యాంకు ఉద్యోగులు, పలువురు ఉపాధ్యాయులు నాంచారయ్యకు శ్రద్ధాంజలి ఘటించారు.

వక్కలగడ్డలో రైతు సదస్సు



చల్లపల్లి: సర్వే బృందాలతో పూర్తి చేసిన సర్వేకు సంబంధించి తయారు చేసిన 9(2) నోటీసులను రైతులకు అందించేందుకు చల్లపల్లి తహసీల్దార్ డీ వనజాక్షి మండలంలోని వక్కలగడ్డ జెడ్పీ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం స్థానిక రైతులతో సదస్సు నిర్వహించారు. మండల పరిధిలోని వక్కలగడ్డ గ్రామాన్ని రీ-సర్వేకు పైలెట్ ప్రాజెక్టగా తీసుకుని కూటమి ప్రభుత్వంలో సర్వే నిర్వహించారు. గ్రామంలోని భూములకు సంబంధించిన నోటీసులను రైతులకు అందజేశారు. ఆ నోటీసుల ద్వారా ప్రతిరైతు వారి యొక్క భూమి కొత్త ఎల్‌పీఎం సర్వే నెంబర్, విస్తీర్ణం సరిచూసుకోవాలని సూచించారు. సదస్సులో ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, ఆర్ఎస్ డీటీ నీలిమ, వీఆర్వోలు, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు. కాగా ఓ పక్క పాఠశాలలో ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తుండగా తరగతి గదులకు పక్కనే రెవిన్యూ అధికారులు రైతు సదస్సు నిర్వహించడంపై పలువురు విద్యావేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మైకు ద్వారా పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులకు అసౌకర్యం కలిగేలా చేయడం సమంజసమా అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

చిట్టూర్పులో గ్రామ సభ



చిట్టూర్పు(ఘంటసాల): ఘంటసాల మండలం చిట్టూర్పు గ్రామ సచివాలయంలో సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పీ-4 సర్వే సకాలంలో పూర్తి చేసి గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి నెమలకంటి శ్రీలక్ష్మి కృష్ణవేణి మాట్లాడుతూ ప్రజల సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేయడానికి పీ-4 సర్వే ఉపయోగపడుతుందని తెలిపారు. సర్వేకు వచ్చే అధికారులకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ శివకుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రమ్య, ఏఎన్ఎం చిత్ర, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇరుకు రోడ్లతో ఇబ్బందులు

- పెడన పట్టణంలో నిత్యం ట్రాఫిక్
- రోడ్లు వెడల్పు చేయాలంటున్న పురప్రజలు



పెడన పట్టణంలో రెండు బస్సులు కూడా పట్టని ప్రధాన రోడ్డులో ఇదీ పరిస్థితి

పెడన: జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో నిత్యం ఆక్రమణలు తొలగిస్తుండటంతో జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశం కావడమే కాకుండా ఆ విధంగా ఎక్కడెక్కడ తొలగిస్తారా అనే మీమాంశం పెడన పురపాలక సంఘంలోని ప్రజల్లో కూడా నెలకొంది. అధిక సంఖ్యలో పురప్రజలు మాత్రం ఆక్రమణలు తొలగించి రోడ్లు విశాలంగా చేస్తే జిల్లా కేంద్రం కంటే పెడన ముందుగా అభివృద్ధి చెందుతుందనే వాదన పలువురిలో నెలకొంది. ప్రధాన రహదారి ఇరుకుగా ఉండటంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఎదురవుతూనే ఉంటుంది. ఎదురెదురుగా రెండు ఆర్టీసీ బస్సులు లేదా స్కూలు బస్సులు వచ్చాయో ఆ రోజు ట్రాఫిక్ గంటల తరబడి నిలిచిపోవాల్సిందే. అసలు ఈ రోడ్డులో ఎందుకు వచ్చామా అన్న విధంగా ప్రయాణికులు, వాహనచోదకులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. బైపాస్ రోడ్డు లేకపోయి ఉంటే ఇప్పటికే పెడన పట్టణంలోని ప్రధాన రహదారులు విశాలంగా ఉండేవనే వాదన కూడా ఉంది. బైపాస్ రోడ్డు వచ్చాక పట్టణంలోని ప్రధాన రహదారిని పట్టించుకోవడం లేదనే వాదన ఉంది.

ఆక్రమణలకు గురైన రోడ్లు

మాస్టర్ ప్లాన్ ప్రకారం పట్టణంలోని మచిలీపట్నం - గుడివాడ రోడ్డు 150 అడుగులు ఉండాలి. కొంత మేర మచిలీపట్నం రైలు గేటు నుంచి వైఎస్సార్ సీపీ కార్యాలయం సందు వరకు ఉన్న రోడ్డు 120, 100 అడుగులు ఉన్నా ఈ రోడ్డుకు ఇరువైపుల ఆక్రమణలకు గురయ్యాయి. ఆ తర్వాత 60 అడుగులు అటు పిమ్మట 40 అడుగుల వరకు ఉంది. దీంతో నిత్యం ట్రాఫిక్ నిలిచిపోతుంది. రెండు బస్సులు కూడా పట్టని రోడ్డు కావడంతో చాలా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అలాగే బంటుమిల్లి రోడ్డు మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 అడుగులు ఉండాలి. కాని ఒక చోట 60 అడుగులు మరో చోట 30 అడుగులు ఉంది. ఇక పెడన - గూడూరు రోడ్డు 80 అడుగులుగా మాస్టర్ ప్లాన్‌లో ఉంది. కాని వాస్తవ పరిస్థితుల్లో రికార్డుల ప్రకారం 60 అడుగులు, 50 అడుగులుగా ఉంది. ఈ విధంగా రోడ్లు ఉండటంతో పట్టణంలో నిత్యం ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆక్రమణలు తొలగించి పట్టణంలోని రోడ్లను వెడల్పు చేయాలని ప్రయాణికులు, వాహనచోదకులు కోరుతున్నారు.



పెడన పట్టణంలోని మచిలీపట్నం - గుడివాడ ప్రధాన రహదారి

ప్రజాభిప్రాయం తీసుకోవాలి



రోడ్లు వెడల్పు చేయాలన్నా, ఆక్రమణలు తొలగించాలన్న కొంత సమయం పడుతుంది. ముందుగా ప్రజాభిప్రాయం సేకరించాల్సి ఉంటుంది. వాస్తవంగా అయితే నిబంధనల మేరకు దీనికి సంబంధించి కౌన్సిల్ దృష్టికి కూడా తీసుకువెళ్లాల్సిన అవసరం ఉండదు. ఉన్నతాధికారుల ఆదేశాలు, ప్రజాభిప్రాయం మేరకు నడుచుకోవడం జరుగుతుంది.

– ఎం. గోపాలరావు, కమిషనర్, పురపాలక సంఘం, పెడన

ద్రవ జీవామృత తయారీపై అవగాహన



వెంకటాపురంలో ద్రవ జీవామృతంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

వెంకటాపురం(మోపిదేవి): ద్రవ జీవామృతం తయారీ విధానం, ఉపయోగాలపై రైతులకు పూర్తి అవగాహన అవసరమని ఘంటసాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ సుధారాణి పేర్కొన్నారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో శుక్రవారం గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమాన్ని బాపట్ల కళాశాల విద్యార్థినులు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ ఒక ఎకరాకు ఆవు మూత్రం(10లీటర్లు), ఆవుపేడ(10కిలోలు), బెల్లం(2కిలోలు), శనగపిండి(2కిలోలు) 200 లీటర్ల నీటిలో కలిపి ద్రవ జీవామృతాన్ని తయారు చేయవచ్చునని తెలిపారు. ఆ విధంగా జీవామృతం తయారు చేసి రైతుల అనుమానాలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంఎస్ డాక్టర్ రేవతి, అభ్యుదయ రైతులు జొన్నలగడ్డ పిచ్చేశ్వరావు, ఆర్ కోటేశ్వరరావు, చినపాప పలువురు రైతులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలి



డీఎంహెచ్‌వో శర్మిష్టకు వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

చిలకలపూడి(మచిలీపట్నం): ఆశ వర్కర్లకు నెలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని ఆశ వర్కర్ల యూనియన్ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షురాలు కుమారి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్ శర్మిష్టకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్న ఆశ వర్కర్లను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలన్నారు. సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న వారికి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించి పింఛను ఇవ్వాలని కోరారు. ఆశ వర్కర్లకు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు కిరణ్మయి, కరుణ, వెంకటరమణ, సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ జయరావు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టుతో ఆరోగ్యవంతమైన నేల

కేవీకే సమన్వయకర్త డాక్టర్ డీ సుధారాణి



వానపాముల ఎరువు తయారీ విధానాన్ని చూపుతున్న శాస్త్రవేత్తలు

ఘంటసాల: వర్మీ కంపోస్టు వినియోగించడం ద్వారా ఆరోగ్యవంతమైన నేల ఏర్పడుతుందని కేవీకే సమన్వయకర్త డాక్టర్ డీ సుధారాణి అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు వానపాముల ఎరువు తయారీపై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువుల మీద పూర్తిగా ఆధారపడటం వల్ల మనకు మేలు చేసే సూక్ష్మజీవులు, వానపాములు అంతరించిపోతున్నాయని చెప్పారు. పరిసరాల కాలుష్య నివారణకు వర్మీ కంపోస్టు ఎరువు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కేవీకే సస్య రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం వెంకటలక్ష్మి మాట్లాడుతూ భూసార పెరుగుదల, నాణ్యమైన పంట, మొక్కకు చీడపీడలను తట్టుకునే శక్తి, నేల ఆరోగ్యంగా ఉండాలంటే వర్మీ కంపోస్టు ఎరువు అత్యంత ఉపయోకరమైందని అన్నారు. అనంతరం వర్మీ కంపోస్టు ఎరువు తయారీ విధానాన్ని చూపించారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ వీ మంజువాణి, డాక్టర్ కే రేవతి, డాక్టర్ బీ నవీన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఐసీఆర్‌పీ ఎల్ 1, ఎల్ 2, ఎంటీ, రైతులు పాల్గొన్నారు.

అంతా సెట్ చేశాం.. ఎవరూ రారు.!

చల్లపల్లి: 'లక్ష కట్టుకో.. బెల్టు షాపు పెట్టుకో' అన్న శీర్షికన శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన కథనం విషయాన్ని తెలుసుకున్న బెల్టుషాపు నిర్వాహకులు హుటాహుటిన వారి వద్ద నుంచి డిపాజిట్లు కట్టించుకుని మద్యం సరఫరా చేస్తున్న సప్లయిదారుల దృష్టికి తీసుకువెళ్లారు. అయితే అంతా సెట్ చేశామని, మిమ్మల్ని పట్టుకోవడానికి ఎవరూ రారని నిరభ్యంతరంగా ఎటువంటి భయం లేకుండా గ్రామాల్లో బెల్టుషాపు ద్వారా మద్యం అమ్ముకోవచ్చని భరోసా కల్పించినట్లు తెలిసింది. అయితే శుక్రవారం సాయంత్రం వరకూ ఎక్సైజ్ అధికారులు గానీ, పోలీసులు గానీ కనీసం ఆయా గ్రామాల్లోకి వచ్చినట్లు ఆనవాళ్లు కూడా లేకపోవడంతో బెల్టు షాపు నిర్వాహకులు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. దీంతో గ్రామాల్లో మద్యం అమ్మకాలు యథావిధిగా కొనసాగుతున్నాయి.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



కోసూరువారిపాలెంలో తనిఖీలు చేస్తున్న సహాయ సంచాలకులు శ్యామల, ఏఓ హెప్సిబా రాణి

మోపిదేవి: మండంలోని పలు ఎరువుల దుకాణాల్లో వ్యవసాయశాఖ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొవ్వ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్ శ్యామల మాట్లాడుతూ జిల్లా వ్యవసాయాధికారి ఆదేశాల మేరకు మండలంలోని ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. అందులో భాగంగా మోపిదేవి, కోసూరువారిపాలెం, పెదకళ్లేపల్లి తదితర గ్రామాల్లో తనిఖీలు చేపట్టగా సుమారు రూ. 1 లక్ష కంటే ఎక్కువ విలువు గల బయో ఎరువులు పట్టుకున్నట్లు చెప్పారు. వాటిని అమ్మడానికి వీలులేకుండా స్టాప్ సేల్స్ నోటీలు ఇచ్చినట్లు వివరించారు. సంబంధిత బయో ఎరువులకు సంబంధించి ఇన్వాయిస్‌లు, లైసెన్సులు మండల వ్యవసాయాధికారికి అందించాలని సూచించినట్లు తెలిపారు. ఏఓ హెప్సిబా రాణి, వ్యవసాయాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకోండి

చిలకలపూడి(మచిలీపట్నం): భారత సైన్యంలో చేరేందుకు అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌కు అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, క్లర్క్, స్టోర్ కీపర్, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్ పోస్టులకు వచ్చే నెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

అవనిగడ్డ: స్థానిక ఆర్టీసీ డిపో కార్యాలయంలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కే హనుమంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో 99592 25466 నెంబర్‌కు ఫోన్ చేసి ప్రయాణికుల అవసరాల కోసం సూచనలు, సలహాలు అందించవచ్చని పేర్కొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

ఘంటసాల: పెద్దగూడెంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీడీవో డీ సుబ్బారావు అన్నారు. ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి టీ జయలక్ష్మీతో కలిసి శుక్రవారం ఆయన పెద్ద గూడెంలో పర్యటించారు. ఈ సందర్భంగా తాగు నీటి సమస్య గురించి వివరాలు తెలుసుకుని, పెద్దగూడెంలో నిరుపయోగంగా ఉన్న నీటి సంపును పరిశీలించారు. బోర్లు ఏర్పాటు చేసి సంపును ఉపయోగించడానికి కావాల్సిన ఏర్పాట్లపై ఇంజినీరింగ్ అసిస్టెంట్ హేమచంద్‌తో మాట్లాడారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈను పెద్దగూడెం పంపించి సమస్యకు పరిష్కారం చూపించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆధార్ ప్రత్యేక శిబిరాలు

ఘంటసాలపాలెం(ఘంటసాల): గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న ఆధార్ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో డీ సుబ్బారావు పేర్కొన్నారు. ఘంటసాల మండలం ఘంటసాలపాలెం, చినకళ్లేపల్లి గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ఆధార్ శిబిరాలను నిర్వహించారు. ఆయా శిబిరాల్లో ప్రజలు తమ ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, నూతన కార్డులు, అప్‌డేట్ చేసుకున్నట్లు తెలిపారు. కాగా శనివారం ఘంటసాలపాలెం, వేములపల్లి గ్రామ పంచాయతీల్లో ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపిడివో తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గుత్తికొండ రాము, ఎం స్వర్ణ, జీ ప్రసన్న లక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు బోలెం అర్జునరావు, అబ్దుల్ నయూమ్ పాల్గొన్నారు.

మహిళా పోలీసుకు సన్మానం



మహిళా పోలీసు మాధురిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కొడాలి(ఘంటసాల): సమర్థవంతంగా విధులు నిర్వహించిన వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ఘంటసాల ఈఓపీఆర్డీ కే వెంకటేశ్వరరావు అన్నారు. ఘంటసాల మండలం కొడాలి సచివాలయంలో మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తున్న నల్లూరి మాధురి తనకు అప్పగించిన ఇంటి పన్ను వసూళ్లు నూరు శాతం పూర్తి చేయడంతో సర్పంచ్ చలపాటి రాణి, ఉప సర్పంచ్ తుమ్మల శంకరరావు, ఈఓ సీహెచ్‌వీఎస్ నాగమణిలతో కలిసి ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు శుక్రవారం మాధురిని ఘనంగా సన్మానించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ మట్టా తేజస్వి, జూనియర్ అసిస్టెంట్ రాజశేఖర్, సచివాలయ, పంచాయతీ ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్రీహరిరావు హత్య కేసులో నిజాలు నిగ్గు తేల్చండి

మాజీ ఎమ్మెల్యే సింహాద్రి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: డాక్టర్ శ్రీహరిరావు హత్యకేసులో నిజాలు నిగ్గు తేల్చాలని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శాసనసభ సమావేశాల్లో డాక్టర్ శ్రీహరిరావు హత్యకేసును రాజకీయ లబ్ధికోసం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ వాడుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. గత శాసనసభలో ఈ విషయం గురించి ఆయన ప్రస్తావించగా సీబీసీఐడీకి కేసుని అప్పగించారని గుర్తుచేశారు. అదే కేసుని మళ్లీ బుద్ధప్రసాద్ శాసనసభలో ప్రస్తావించడం వెనుక రాజకీయ దురుద్దేశం ఉందని మండిపడ్డారు. ఈ కేసుని త్వరగా తేల్చాలని గతంలో జిల్లా ఎస్పీలు, డీఎస్పీలను కలిసి ఒత్తిడి తెచ్చినట్లు సింహాద్రి పేర్కొన్నారు. నాలుగు నెలల క్రితం లంకమ్మ మాన్యంలో అదృశ్యమైన మూడేళ్ల చిన్నారి ఉదంతాన్ని ఎందుకు అసెంబ్లీలో ప్రస్తావించలేదని బుద్ధప్రసాద్‌ని ప్రశ్నించారు. రాజకీయ ప్రాబల్యం కోసం కాకుండా శ్రీహరిరావు హత్యకేసు, చిన్నారి మిస్సింగ్ కేసును చేదించేలా చర్యలు తీసుకోవాలని సింహాద్రి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు రేపల్లె శ్రీనివాసరావు, పార్టీ యూత్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గాజుల జయగోపాల్, ఎంపీటీసీ సభ్యుడు తోట గణేష్, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్‌బాషా పాల్గొన్నారు.

మినుము కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

బంటుమిల్లి: మండల పరిధిలోని రైతు సేవా కేంద్రాల(ఆర్ఎస్‌కే) ద్వారా మినుము కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతు సంఘ నాయకులు డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం పెడన డివిజన్ కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ దాళ్వాలేని క్రమంలో రైతులు సాగు చేసిన రెండో పంట మినుము సరైన దిగుబడులు రాక రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో వ్యాపారస్తులు రూ. 7,500లకే మినుము కొనుగోలు చేస్తుండటంతో రైతులు నష్టపోతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి స్థానిక ఆర్ఎస్‌కేల ద్వారా మినుము కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు రూ. 9వేల మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కే పూర్ణచంద్రరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు, రైతు సంఘ నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు రైతు సంఘ నాయకులు పలు గ్రామాల్లో పర్యటించి మినుము దిగుబడులు, మార్కెట్ల ధరలపై రైతులతో చర్చించారు.

ముందస్తు నోటీసులు లేకుండా స్వాధీనం అంటే ఎలా.!

అధికారులను ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ నాయకులు



పోలీసులతో మాట్లాడుతున్న పేర్ని కిట్టు, థామస్‌నోబుల్ తదితరులు

మచిలీపట్నంటౌన్: ఆక్రమణల తొలగింపులో నగరపాలకసంస్థ అధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది. నగరంలోని ఉల్లింగిపాలెంలోని ప్రభుత్వ గుమ్మటాల చెరువు ప్రాంతంలో చెరువుకు సంబంధం లేని వైఎస్సార్ సీపీకి చెందిన మోకా వర్మకు చెందిన దాదాపు మూడు సెంట్ల స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు శుక్రవారం నగరపాలకసంస్థ టౌన్ ప్లానింగ్ విభాగ అధికారులు రావడం వివాదానికి కారణమైంది. గుమ్మటాల చెరువు కంచె బయట ఉన్న ఈ స్థలం గత 30 ఏళ్లుగా వర్మ ఆధీనంలో ఉంది. ఈ స్థలంలో అంగన్‌వాడీ భవన నిర్మాణం చేసేందుకు స్వాధీనం చేసుకుంటున్నామంటూ అధికారులు వచ్చారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పేర్ని కృష్ణమూర్తి(కిట్టు), మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, పార్టీ జిల్లా కోశాధికారి బందెల థామస్‌నోబుల్, జిల్లా అధికార ప్రతినిధి షేక్ అచ్చేబా, కార్పొరేటర్లు మేకల సుబ్బన్న, మాచవరపు రాంప్రసాద్ అక్కడికి చేరుకుని అధికారుల చర్యను తప్పుపట్టారు. ఈ స్థలంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి సంబంధించి ఐసీడీఎస్ శాఖ నుంచి మంజూరు పత్రం లేకుండా ఎలా స్వాధీనం చేసుకుంటారని ప్రశ్నించారు. వర్మకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా ఎలా స్వాధీనం చేసుకుంటారని ప్రశ్నించారు. చివరికి అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోవడంతో వివాదం సద్దుమణిగింది.

మహిళలు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

బందలాయిచెరువు(అవనిగడ్డ): మహిళలు అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కోఆర్డినేటర్ డాక్టర్ డీ సుధారాణి పేర్కొన్నారు. ఘంటసాల కేవీకే ఆధ్వర్యంలో బందలాయిచెరువులో ఐదు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా మహిళలు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నారు. మత్స్య శాస్త్రవేత్త జే యశ్వంత్‌కుమార్ మాట్లాడుతూ చేపలు, రొయ్యలతో చేసే విలువ ఆధారిత ఉత్పత్తులైన ఫిష్ కట్లెట్, ఫిష్ బాల్స్, చేపల పచ్చడి, రొయ్యల పచ్చడి, చేప మురుకులు, ఫిష్ ఫింగర్స్, చేపల పకోడి, ఫిష్ సమోసా వంటివి తయారు చేయడం ద్వారా మంచి లాభాలు గడించవచ్చని తెలిపారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు కోఆర్డినేటర్ సుధారాణి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ రేవతి, పలువురు మహిళలు పాల్గొన్నారు.

ముమ్మరంగా హెడ్ వాటర్ వర్క్స్ మరమ్మతులు



హెడ్ వాటర్ వర్క్స్‌లో పనులు పరిశీలిస్తున్న కౌన్సిలర్ ప్రసాద్

పెడన: హెడ్‌వాటర్ వర్క్స్‌లో మరమ్మతులు వేగవంతం చేయాలని మున్సిపల్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన హెడ్‌వాటర్ వర్క్స్‌లో జరుగుతున్న మరమ్మతులను మున్సిపల్ ఏఈ సీతారామాంజనేయులుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురప్రజలకు రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉప్పాల రాముల ప్రత్యేక చొరవతో మున్సిపాలిటికి రూ. 30లక్షలు జిల్లా కలెక్టర్ నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఈ నిధులతో ప్రస్తుతం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని చెప్పారు. ఈ మరమ్మతుల కారణంగా నీటి సరఫరాలో చిన్నపాటి అంతరాయాలు చోటుచేసుకునే అవకాశాలున్నాయని, కావున పురప్రజలు సహకరించాలని కోరారు.

తడి-పొడి చెత్త సేకరణ పరిశీలన

కొడాలి(ఘంటసాల): ఇంటింటికీ వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు తడి-పొడి చెత్తను విడివిడిగా అందించాలని ఘంటసాల ఈఓపీఆర్డీ కే వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని ఘంటసాల, ఘంటసాలపాలెం, కొడాలి, చిట్టూర్పు, శ్రీకాకుళం, లంకపల్లి, చినకళ్లేపల్లి గ్రామాల్లో తడి-పొడి చెత్త సేకరణ పనులను ఆయా పంచాయతీ కార్యదర్శులు నిర్వహించగా శుక్రవారం ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఆయా గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించారు. అధికారులు తడి-పొడి చెత్తను వేరు చేసి అందించే విధానంపై, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు జయలక్ష్మి, అర్జునరావు, నాగమణి, శ్రీలక్ష్మి, శ్రీనివాసరావు, నాంచారమ్మ, అబ్దుల్ నయీమ్, సిబ్బంది పాల్గొన్నారు.